క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



గొల్లపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ జగన్నాథం, మండల యువజన విభాగం అధ్యక్షుడు త్రినాథరావు, తదితరులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీలోని గొల్లపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యుడు పొంతపల్లి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ మండల యువజ విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు శనివారం భూమిపూజ చేశారు. అలాగే పెదతాడివాడ పంచాయతీ ఎస్సీ కాలనీలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

విజయనగరం టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన అతి పురాతన శివలింగానికి శనివారం విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం సుమారు 5వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి, కమిటీ సభ్యులు శోభారాణి, భీమరాజు, భవానీ, మారమ్మ, భరణి, రాము, రమేష్, అర్చకుడు సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో

నెల్లిమర్ల రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విజయనగరం: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలను స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని విజయనగరం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు ముళ్లపూడి సుభద్రాదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు కోట కూడలి వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ సంస్థ తరఫున ప్రతి ఏడాదీ మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వాసవి, సత్యలత, గీత, రుక్మిణీదేవి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాలలో ముగిసిన స్కిల్ వర్క్‌షాపు



ధ్రువపత్రాలతో శిక్షణార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉద్యోగ నైపుణ్యాల వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్, నాంది ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో బాడీ లాంగ్వేజ్, ప్రొఫెషనల్ గ్రూమింగ్, గోల్ సెట్టింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో కె.గౌతమ్‌శంకర్, పి.వేణుగోపాల్, డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, ఎం.ఉదయ్‌కిరణ్, కె.పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం అందజేశారు. శనివారం తన నివాసంలో ఏడుగురికి రూ.7.80 లక్షల మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలంతా నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలిచర్లలో.. అభివృద్ధి దరహాసం...

- మౌలిక సదుపాయాల కల్పన
- అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్న గ్రామం
- అర్హులందరికీ ఆర్థిక భరోసా..



గ్రామ సచివాలయ భవనం



కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన ఎంపీపీ పాఠశాల



అభివృద్ధి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల



మలిచర్లలో నిర్మించిన సీసీ రోడ్డు

విజయనగరం రూరల్: 'మాట తప్పను... మడమ తిప్పను'.. 'నేను విన్నాను... నేను ఉన్నాను' అన్న మాటలను నిజం చేస్తూ ఐదేళ్లలో పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలిచారు.

ఏ గ్రామం చూసినా... ఏ పేదింటిని కదిపినా ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే కనిపిస్తుంది.. వినిపిస్తుంది. దేశ చరిత్రలోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధిలో కొంతపుంతలు తొక్కించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అదేవిధంగా అవినీతికి తావులేకుండా, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని చెప్పక తప్పదు. ఒక్కో గ్రామ అభివృద్ధికి, సంక్షేమానికి కోట్లాది రూపాయలు వెచ్చించడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి.

అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు

భవన నిర్మాణాలకు చేసిన ఖర్చు	: రూ. 84.74 లక్షలు
సీసీ రోడ్ల నిర్మాణాలకు	: రూ. 49.7 లక్షలు
కాలువలు, ప్రహరీల నిర్మాణానికి	: రూ. 11.8 లక్షలు
పాఠశాలల అభివృద్ధికి	: రూ. 71.2 లక్షలు
లబ్ధిదారులకు ప్రత్యక్షంగా చేకూరిన లబ్ధి	: రూ. 14.28 కోట్లు
పరోక్ష లబ్ధి	: రూ. 4.12 కోట్లు

విజయనగరం మండలం మలిచర్ల సచివాలయం పరిధిలోని మలిచర్ల, సుంకరిపేట గ్రామాలు అభివృద్ధిలో అదరహో అనిపించడంతో ఆయా గ్రామాల ప్రజలు జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాలకు రూ 14.40 కోట్లను నేరుగా లబ్దిదారులకు అందించగా, అభివృద్ధికి మరో 2.34 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

రూ. 84.74 లక్షలతో భవన నిర్మాణాలు

2019కి ముందు చిన్నపాటి గదిలోనే మలిచర్ల గ్రామ పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించేవారు. అప్పటికే ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని కార్పొరేట్ హంగులతో ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయంలోనే గ్రామస్తులకు త్వరితగతిన సేవలు అందుతున్నాయి. అలాగే గ్రామంలోనే రైతులకు సేవలందించాలనే ఉద్దేశంతో రూ. 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం.. 24 గంటలూ వైద్యం అందించాలనే ఆశయంతో రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్ర భవనం నిర్మించారు.



రూ. 49.7 లక్షలతో సీసీ రోడ్లు

మలిచర్ల గ్రామ పరిధిలోని ఏ గ్రామం చూసినా, ఏ వీధి చూసినా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో గ్రామ సచివాలయ పరిధిలోని మలిచర్లలో రూ.18.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించగా, సుంకరిపేట గ్రామంలో రూ. 31.50 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. అలాగే రెండు గ్రామాల్లోనూ రూ. 7.80 లక్షలతో కాలువలు నిర్మించగా.. మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలతో కొత్తగా కాలువలు నిర్మిస్తున్నారు. మలిచర్లలో మరో రూ. 4 లక్షలతో సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాల చుట్టూ ప్రహరీలు నిర్మించారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మలిచర్లలో రూ 7.60 లక్షలతో ఇంటింటి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయగా... సుంకరిపేటలో రూ. 8.7 లక్షలతో కుళాయిలు ఏర్పాటు చేశారు.



రైతభరోసా కేంద్రం

రూ. 71.2 లక్షలతో పాఠశాలల అభివృద్ధి

గ్రామ సచివాలయం పరిధిలోని మలిచర్ల, సుంకరిపేట గ్రామాల్లో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు తొలివిడతలో భాగంగా రూ. 62.6 లక్షలు మంజూరు కాగా, రెండో విడతలో రూ. 8.61 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆయా పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

పేదల సంక్షేమానికి రూ.14.4 కోట్లు

రెండు గ్రామాల ప్రజల సంక్షేమానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం 29 సంక్షేమ పథకాలకు రూ. 18.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. వైఎస్సార్ పింఛను కానుకకు రూ. 4.55 కోట్లు అందించగా, గృహ నిర్మాణాలకు రూ. 1.5 కోట్లు, వైఎస్సార్ రైతుభరోసా కింద రూ. 2.44 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకానికి రూ. 1.54 కోట్లు, జగనన్న అమ్మఒడి పథకానికి రూ. 1.34 కోట్లు, వైఎస్సార్ ఆసరాకు రూ.1.56 కోట్లు మంజూరు చేశారు.

అభివృద్ధే అజెండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సదాశయానికి తోడు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నాలుగేళ్లలో గ్రామ అభివృద్ధికి కృషి చేశాం. స్థానిక నాయకుల సహకారం తోడై ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామ సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ. 21 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. **– తుమ్మగంటి రమాకుమారి, సర్పంచ్, మలిచర్ల గ్రామం**

మనవడిలా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే పింఛన్ పెంచుతూ రూ.3 వేలు అందిస్తున్నారు. అది కూడా గ్రామ వలంటీర్లు పొద్దు పొడవక ముందే ప్రతినెలా ఒకటో తేదీన ఇంటికి తీసుకువచ్చి అందిస్తున్నారు. టీ, ఇతర ఖర్చులకు పిల్లలపై భారం కాకుండా సీఎం జగన్ మనవడిలా ఆదుకుంటున్నాడు. **– కొసర అప్పారావు, పింఛనుదారుడు, మలిచర్ల గ్రామం**

గ్రామ రూపురేఖలు మార్చాం



గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను రూ. 72 లక్షలతో అభివృద్ధి చేశాం. మౌలిక సదుపాయాల కల్పనతో పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. అలాగే రూ. 37 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం పూర్తి చేశాం. పేదలకు ఒక్కొరికీ రూ. 10 లక్షల విలువ చేసే ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశాం. **– ఎస్.రాజేశ్వరి, సర్పంచ్, సుంకరిపేట గ్రామం**

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారు. ఇప్పటివరకు చిన్న గదిలో మా అబ్బాయితో జీవిస్తున్నాను. ఇంటి నిర్మాణం దాదాపు పూర్తయింది. కొద్దిరోజుల్లో అక్కడికి మారుతున్నాం. కొడుకులా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం." **– కోట్ల అప్పయ్యమ్మ, హౌసింగ్ లబ్దిదారు, మలిచర్ల గ్రామం**

చేయూత ఆదుకుంటోంది..



నా భర్త ఇటీవలే మరణించాడు. పిల్లలు చనిపోయారు. మనవళ్లు దూరంగా ఉంటున్నారు. నాలుగేళ్లుగా ఇస్తున్న చేయూత పథకంతోనే జీవనం సాగిస్తున్నాను. పింఛను మంజూరైతే మరింత ఆనందంగా ఉంటుంది. చేయూత పథకం అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ఎల్లప్పుడూ నా ఆశీస్సులు ఉంటాయి. **– ఒల్లూరి అంబ, చేయూత పథకం లబ్దిదారు, మలిచర్ల**



సుంకరిపేట జగనన్న కాలనీ



మలిచర్లలో జగనన్న కాలనీ



మలిచర్లలో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రం

కొండకరకాంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కళాశాల సిబ్బంది

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాంలో సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం సేవా శిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సర్పంచ్ కిలారి రమ్య, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థీ ఎన్ఎస్ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ.. పుస్తకం ద్వారా విద్యను అందిస్తే సరిపోదని, ఆచరణాత్మక శిక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం శిబిరానికి సంబంధించిన మెటీరీయల్‌ను వైద్య సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్. సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు.

అందరికీ సమాన అవకాశాలు

- జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ జయసుమ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు జయసుమ, విజయ, తదితరులు

డెంకాడ: సమాజంలో స్త్రీ, పురుషలిద్దరికీ సమాన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు మహిళలను ప్రోత్సహించాలని జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించితే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గౌరవ అతిథి విశాఖ ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్-జి ఎం.విజయ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు ఎదుర్కొంటున్న వివక్షను వివరించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, టెడ్‌టాక్, డ్యాన్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, అధ్యాపకురాలు ప్రభ, మహిళా కోఆర్డినేటర్లు, మహిళా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



ప్రత్యేకాలంకరణలో ఉమాసదాశివుడు



శృంగవరపుకోట: మెట్ల మార్గంలో పుణ్యగిరికి తరలివెళ్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో చేపట్టిన మహాశివరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ వేడుకల్లో దాదాపు రెండు లక్షలకు పైగా భక్తులు శివకేశవులను దర్శించుకున్నట్లు ఆలయ అధికారుల అంచనా. ఆలయ ప్రాంగణం, కల్యాణ మండపం, బోడికొండ ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. నీలాచలం బోడికొండ, రామస్వామి ఆలయం, కోనేరు గట్టు ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందురోజు రాత్రంతా జాగారాలు చేసి, ఉదయాన్నే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సీతారామస్వామిని, ఉమాసదాశివస్వాముల వారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఉమాసదాశివాలయంలో లింగోద్భవ పూజలు జరగ్గా, ఆ సమయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటీపడ్డారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం తదితర ప్రాంతాల మత్స్యకారులు వృత్తంలా ఏర్పడి, వారి మధ్యలో స్వామి ప్రతిమ ఉంచి, సంప్రదాయ నృత్యాలు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గస్తీ చేపట్టారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ఎస్ఐ రామగణేష్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ అల్లరిమూకల ఆగడాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాలు విజయవంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, మిమ్స్, సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీల సిబ్బంది భక్తులకు తమవంతు సహాయ సహకారాలు అందించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి సురేష్ బాబు, ఈవో శ్రీనివాసరావు, తదితరులు ఉత్సవాల నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు.



నెల్లిమర్ల రూరల్: జాతరలో భక్తుల రద్దీ

పుణ్యగిరిలో జనసిరి..

శృంగవరపుకోట: మహాశివరాత్రి వేళ జాగరణ చేసిన భక్తులంతా ముక్కంటీశ్వరుని దర్శనం కోసం పుణ్యగిరికి శనివారం బారులుతీరారు. ఉదయం నుంచి ప్రారంభమైన దర్శనాలు రాత్రి వరకు కొనసాగాయి. తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం, ఒడిశాలోని పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుట్టుదార, దారగంగమ్మ లోయల వద్ద పుణ్యస్నానాల కోసం భక్తులు పోటీపడ్డారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ సరఫరా చేసి, భక్తుల దాహార్తిని తీర్చారు.

నెరవేరిన సొంతింటి కల..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పేదల సొంతింటి కల నెరవేరింది. పట్టణానికి చెందిన 1024 మంది లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఇళ్ల తాళాలు, పత్రాలు అందజేశారు. సారిపల్లి ప్రాంతంలో నాణ్యతాప్రమాణాలతో నిర్మించిన ఇళ్లు దశలవారీగా కేటాయించడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది లబ్ధిదారులు గృహప్రవేశాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని కోలగట్ల అన్నారు. మిగిలిన వారు కూడా గృహప్రవేశాలు చేపట్టి నివాసం ఉండాలని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



విశాలమైన రోడ్లుతో సారిపల్లి టిడ్కో కాలనీ



మంచినీటి ట్యాంక్



వంటగది



లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు